
ఆదోనిలో మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


ఆదోనిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


కోసిగిలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


రచ్చమర్రి శిబిరంలో మాట్లాడుతున్న జి.భీమారెడ్డి

క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థినులకు బుక్స్ అందజేస్తున్న విశ్వమానవ సేవా సమితి సభ్యులు

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్షలో సత్తా చాటాలని కోసిగి విశ్వమానవ సేవా సమితి సభ్యులు సూచించారు. వారు శుక్రవారం బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరి దేవి సమక్షంలో విద్యార్థినులకు స్టడీ మెటీయరిల్ అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్కాలర్ షిప్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల పీడీ రాజారాం, ఆ సమితి సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెండెన్స్, మరమ్మతు పనుల నిమిత్తం రెండవ శనివారం రోజున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్లో మరమ్మతు పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్షల్లో కూర్చొన్న న్యాయవాదులు

ఆదోనిరూరల్: మెస్కిలినీయస్ పిటిషన్‌లకు రూ.20 పెంచడాన్ని నిరసిస్తూ ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ దీక్షలో సీనియర్ న్యాయవాదులు గిరిధర్, మజహర్ ఉల్‌హక్, గురు, జూనియర్ న్యాయవాదులు తరుణ్, హుసేన్‌సాని, సన్నీ, శేఖర్, సల్మాన్, క్రిష్ణ, దేవరాజు, జీవన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని, పెంచిన రూ.20 ఫీజు తగ్గించాలన్నారు. లేనిపక్షంలో రిలేనిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బీమా నగదును అందజేస్తున్న సర్పంచ్ రామాంజినేయులు

పెద్దకడబూరు(మంత్రాలయం): నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన వైఎస్సార్ బీమా పథకం వరంలాంటిదని గ్రామ సర్పంచ్ రామాంజనేయులుఅన్నారు. శుక్రవారం పెద్దకడబూరులోని మాల కాలనీలో నివాసం ఉంటున్న శంకరమ్మ అనే మహిళ అకాల మరణం పొందారు. ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా నగదు త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందని తెలిపారు. సచివాలయ సిబ్బంది సంధ్యరాణి ఉన్నారు.

భవిత కేంద్రం పరిశీలన


భవిత కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

గోనెగండ్ల: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం డీఈఓ రంగారెడ్డి పరిశీలించారు. కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు. వారి విద్యాభ్యాసం ఎలా కొనసాగుతుందని ఎంఈఓ రామాంజినేయులను అడిగి తెలుసుకున్నారు. ఇతర అవసరాలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మండలంలోని పలు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ నాయకులు డీఈఓ రంగారెడ్డికు వినతిపత్రం అందజేశారు. అలాగే జీపీఎస్‌ను రద్దు చేసి ఆ స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు గుమ్మలబాబు, అబ్దుల్ సలీం కోరారు. శుక్రవారం పోస్టు కార్డుల ఉద్యమాన్ని గోనెగండ్ల ఉన్నత పాఠశాల ప్రాంగనంలో వారు ప్రారంభించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ భరోసా


కాత్రికి గ్రామంలో వృద్ధురాలికి కళ్లద్దాల పంపిణీ


శిబిరానికి హాజరైన ప్రజలు

ఆదోనిటౌన్: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదోనిలో రెండు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. 25, 26, 27 వార్డులకు సంబంధించి వెంకన్నపేట వీధిలోని ఎంసీహెచ్ సెంటర్‌లో, 28, 29 వార్డులకు వీరశైవ కళ్యాణ మండపంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వీరశైవ కళ్యాణ మండపంలో ప్రజలు, కూలీలు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శిబిరంలోని డాక్టర్ల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో మందులు పొందారు. ఈసీజీ, రక్త పరీక్షలు, బీపీ, షుగర్, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలను చేయించుకున్నారు. 800 మందికి పైగానే వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఎంసీహెచ్ సెంటర్‌లో 750 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు, సిబ్బంది మందులు ఇవ్వడం, రక్తపరీక్షలు, ఈసీజీ తదితర వాటిని తీశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. వైద్యశిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు ఇప్పటివరకు ఏ ప్రభుత్వం నిర్వహించలేదని చెబుతూ మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు నాగరత్నమ్మ, మహ్మద్‌స్వామి, మల్లికార్జున, ఖాదర్‌బాషా, శానిటేషన్, అంగన్‌వాడీ, ఐకేపీ మెప్మా, మున్సిపల్ ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.భీమారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రచ్చమర్రి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి కార్పొరేట్ తరహాలో ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆర్యోగ సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలందించి మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ మణిమంజరి, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కోసిగి: ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని, ఇందుకోసం ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈరన్న వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతేష్ స్వామి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మెంబర్ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సచివాలయం-1 పరిధిలోని ప్రజలకు సర్పంచ్ కుమారి అయ్యమ్మ అధ్యక్షతన డాక్టర్ నజీర్ అహ్మద్, డాక్టర్ అభిరూప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీ ద్వారా 332 మందికి వైద్య సేవలందించారు. ప్రధానంగా కాళ్ల నొప్పులు, గుండె పోటు, రక్త పరీక్షలు, బీపీ, హెచ్‌బీ, గర్భిణులకు వైద్యం, వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసి గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. డాక్టర్ రజిత, గైనికాలజిస్ట్ డాక్టర్ ప్రవళిక, ఫిజీషియన్ డాక్టర్ పవన్‌కుమార్, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని కాత్రికి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 11వ రోజు క్యాంపును నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ ఇన్‌చార్జి నాగభూషణ్‌గౌడ్, సర్పంచ్ యంకప్ప, ఎంపీడీఓ సుబ్బారాజు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల ప్రతి రోగికి వైద్యం అందుతోందని తెలిపారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలందించి మందులను పంపిణీ చేశారు. కంటి సమస్యలున్న వారికి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడి సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇమ్మానుయల్, శిరీష, సుజాత, మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గవిగట్టులో ఆరోగ్య సురక్ష

పెద్దకడబూరు(మంత్రాలయం): మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు.

చికిత్స చేసి మందులు ఇచ్చారు



కోసిగి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు చేసి మంచి ట్యాబ్లెట్లు ఇచ్చారు. ఆరుగురు డాక్టర్లు వచ్చి క్యాంప్‌లో అన్ని రకాల వైద్య సేవలందించారు. బీపీ, షుగర్ చెక్ చేశారు. గతంలో ఏనాడు ఇలాంటి క్యాంప్‌లు ఏర్పాటు చేయలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంప్ ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉంది.

– లక్ష్మీ, కోసిగి


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైద్యాధికారులు, ఎంపీడీఓ సమక్షంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి శిబిరాన్ని పర్యవేక్షించారు. స్పెషలిస్ట్ వైద్యులు ఓపీ ద్వారా రోగులకు వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశారు. వైద్య బృందం పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

ఆదోనిటౌన్: గత ప్రభుత్వం విద్య, వైద్య రంగాన్ని నామరూపాలు లేకుండా కనుమరుగయ్యే పరిస్థితికి తీసుకురాగా, జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం జరిగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని హనుమాన్ నగర్‌ను సందర్శించారు. 350 గడపల్లో పర్యటించి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలు. వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందించి మరిన్ని పథకాలు పొందవచ్చని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం స్కాంలతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వానికి, జగనన్న పాలనకు ఉన్న తేడాను గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఏఈ కృపాకర్, డీఈ నాగభూషణంరెడ్డి, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు

ఆదోనిఅర్బన్: బాలికలను ఉన్నత చదువులు చదివించాలని జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ అన్నారు. శుక్రవారం ఆదోని జీవీసీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డిస్నీ ప్లస్ హాట్ స్టార్ సహకారంతో యునైటెడ్ వే ముంబై ఆధ్వర్యంలో ప్రగతి ప్రాజెక్టు స్టేమ్ ల్యాబొరేటరీని స్థాపించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 శ్రీనివాసులు మాట్లాడుతూ బాలికలు విజ్ఞాన రంగంలో సైంటిస్టులుగా ఎదగాలని సూచించారు. హెచ్ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. దాతల సహకారాన్ని కొనియాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థినులు ఉపయోగించుకుని గొప్ప సైంటిస్టులుగా ఎదగాలన్నారు. యునైటెడ్ వే ముంబై ప్రగతి ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ కుమారి రియా మాట్లాడుతూ.. బాలికల ఔన్నత్యానికి మరింత తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు

ఆదోనిరూరల్: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం వై.టి.భీమేష్ అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, పట్టణ కార్యదర్శి వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, సీపీఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావి రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. నేటి పాలకులు సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తెచ్చి ఇప్పటికే 29 చట్టాలను కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలపై పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ పట్టణ సహాయ కార్యదర్శి ప్రకాష్, జిల్లా సమితి సభ్యులు షేక్షావలి, నాయకులు గోవిందు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవంలో రింగు కర్రలు వద్దు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి దసరా బన్ని ఉత్సవాన్ని సంప్రదాయంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం నెరణికి, కొత్తపేట గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. బన్ని ఉత్సవానికి భక్తులు రింగు కర్రలు తీసుకెళ్లడం, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం మంచి సాంప్రదాయం కాదన్నారు. విగ్రహాల ఊరేగింపులో అగ్గి కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు పాల్పడడం వంటివి చేస్తే చర్య లు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై నిఘా ఉంటుందని చెప్పారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ఆలూరు: మండలంలోని అరికెర, అరికెరతాండ గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ అల్లబకాష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి దేవరగట్టు బన్ని ఉత్సవం నిర్వహణపై పలు సూచనలు చేశారు. రింగు కర్రలు తీసుకెళ్లరాదని, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనరాదని, కక్షలు, కార్పణ్యాలకు పోకుండా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. హాలహర్వి ఎస్ఐ నాగేంద్ర మాట్లాడుతూ.. ఎవరైనా నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, అక్రమంగా కర్ణాటక మద్యం తరలించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీటీ గుండాలనాయక్, సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడు, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, సర్పంచ్ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి

కౌతాళం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వీరాలదిన్నె గ్రామంలో దివాకర్ రెడ్డి, దశరథ్ రెడ్డి, గురునాథ్ రెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయ తేడాల్లేకుండా అర్హులైన వారందరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్ ఎన్ని కుట్రలు పన్నినా ఒరిగేదేమి లేదన్నారు. రాష్ట్ర ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదని, పార్టీలన్నీ ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు తమ పార్టీకి విజయాన్ని తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ప్రహ్లాదచారి, స్థానిక నాయకులు ఉమేష్, జగదీష్‌స్వామి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రౌడూరు పాండురంగారెడ్డి, జైపాల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చిరుత జాడ గుర్తింపునకు నిఘా కెమెరాల ఏర్పాటు


గొర్రెల మందను తరలించాలని సూచిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి

కోసిగి: మండల కేంద్రం కోసిగి పరిసర కొండ ప్రాంతాల్లో చిరుత కదలికలను పసిగట్టేందుకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఫారెస్ట్ అధికారుల ఆదేశాల మేరకు కోసిగి కొండ ప్రాంతమైన ఎల్లమ్మ ఆలయ మైదానం, సత్యమ్మ గుడి వద్ద బసవన్న కొండ, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో ఆమె పరిశీలన చేశారు. కొండ దిగువ ప్రాంతాల్లో నిలిపిన గొర్రెల స్థావరాలను పరిశీలించి వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని కాపరులకు విన్నవించారు. కొండలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చిరుతలు ఎక్కడెక్కడ సంచరిస్తున్నాయి, ఎన్ని చిరుతలు ఉన్నాయో గుర్తిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే వాటిని బందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మణిధర్ నాయుడు, బీట్ ఆఫీసర్ అనురాధ వెంట ఉన్నారు.

హొసరిత్తి మఠంలో పీఠాధిపతి


జీరేంద్రులతీర్థుల బృంధావనానికి మొక్కుతున్న పీఠాధిపతి

మంత్రాలయం: ధార్మిక పర్యటనలో భాగంగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కర్ణాటకకు వెళ్లారు. శుక్రవారం హావేరి జిల్లా హొసరిత్తి మఠంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీమఠం పూర్వ పీఠాధిపతులు జీరేంద్ర తీర్థుల మూలబృంధావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మూలరామదేవర సంస్థాన పూజ నిర్వహించారు. ఈ వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

బెట్టింగ్ ముఠా అరెస్ట్

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణ శివారులోని సిరుగుప్ప చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ నాటుసారా అమ్ముతున్న ఆదోని పట్టణానికి చెందిన బోయ మహానంది, బి.రమేష్, గొల్ల భీమకుమార్‌లను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహ విలేకరులకు తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ సత్తార్‌వలీ, పీసీలు ప్రత్యేక బృందంగా ఏర్పడి దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి నగదు రూ.3 లక్షలు , నాలుగు సెల్ ఫోన్లు, మూడు ప్లాస్టిక్ క్యాన్లలో ఉన్న 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదోని పట్టణంలో మరికొంత మంది క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, త్వరలోనే వారిని కూడా పట్టుకుని జైలుకు పంపుతామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

వేధింపుల కేసు నమోదు

వెల్దుర్తి: స్థానిక సచివాలయం-3 జేఎల్ఎం మధు, కుటుంబీకులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వేధింపులు, గృహహింస కేసు నమోదైనట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. 11 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని వెల్దుర్తిలో నివాసముంటుండగా, ఇటీవల కట్నం కోసం వేధిస్తున్నాడని మధుపై అతని భార్య జయలక్ష్మి ఫిర్యాదు చేసింది. మంగళవారం తన బంధువులు పంచాయతీ చేసేందుకు రాగా మధుతోపాటు అతని మామ, ఆడపడుచు, మరిది, చిన్న అత్త తనపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నిందితుడితో పాటు, అతని కుటుంబీకులపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన సులోచన కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై శుక్రవారం పురుగు మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు ఇంట్లో ఎవరూ లేనప్పుడు పురుగు మందు తాగిందని బంధువులు తెలిపారు.

● అలాగే మండలంలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన శివలింగమ్మ శుక్రవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. శివగంగమ్మ కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఎలకల మందు సేవించిందని, అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని కాత్రికి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమాతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల్లో విద్యార్థుల కోసం తయారుచేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వెజిటబుల్ రైస్, ఆలు కుర్మా, బాయిల్డ్ ఎగ్, చిక్కీలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మొత్తం 372 మంది విద్యార్థులకుగాను 259 మంది హాజరు కావడంతో, వంద మందికి పైగా విద్యార్థులు పాఠశాలకు రాకపోవడం ఏమిటని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. సర్పంచ్ యంకప్ప, పంచాయతీ కార్యదర్శి నగేష్, గ్రామ ఇన్‌చార్జి నాగభూషణ్‌గౌడ్, ఎంపీటీసీ వసంతకుమార్ ఉన్నారు.